బాలుడి మృతి.. ఆసుపత్రి వద్ద ఉద్రిక్తత

- వైద్యుల నిర్లక్ష్యమే కారణమంటూ బంధువుల ఆరోపణలు
- అర్ధరాత్రి నుంచి ఉదయం వరకూ పోలీసులు బందోబస్తు

శెనార్తి మీడియా, మంచిర్యాల :

మంచిర్యాల పట్టణంలోని ఓ ప్రైవేటు ఆసుపత్రిలో నాలుగు నెలల శిశువు మృతి చెందిన ఘటన గురువారం ఉద్రిక్తతకు దారితీసింది. వైద్యులు సమయానికి స్పందించి ఉండి ఉంటే ప్రమాదం తప్పేదని ఆరోపిస్తూ బంధువులు అర్ధరాత్రి నుంచే ఆసుపత్రి ఎదుట ఆందోళన చేపట్టారు. ఆగ్రహంతో కొంతమంది ఆసుపత్రి అద్దాలను పగులగొట్టడంతో ఉద్రిక్తత మరింత పెరిగింది.

ముందస్తుగా సమాచారం ఇవ్వలేదన్న బంధువుల ఆవేదన

చికిత్స పొందుతున్న శిశువుకు కార్డియాక్ ఎటాక్ వచ్చిన విషయాన్ని వైద్యులు తల్లిదండ్రులకు ముందుగానే తెలియజేయలేదని బంధువులు ఆరోపించారు. పరిస్థితి విషమించడంతో రాత్రి రెండు గంటల సమయంలో పోలీసులు ఆసుపత్రికి చేరుకుని పరిస్థితిని సమీక్షించారు.

శ్వాస సమస్యలతో చేరిన చిన్నారి మృతి

జగిత్యాల జిల్లా శేఖర్–సౌందర్య దంపతుల నాలుగు నెలల కుమారుడు కార్తీక్‌కు శ్వాస ఇబ్బందులు రావడంతో మంచిర్యాలకు తీసుకువచ్చి ఆసుపత్రిలో చేర్పించారు. అయితే బుధవారం అర్ధరాత్రి తర్వాత పరిస్థితి ఒక్కసారిగా దిగజారడంతో శిశువు ప్రాణాలు కోల్పోయాడు. ఈ సమాచారం తెలిసిన బంధువులు కన్నీళ్లలోనే ఆవేదన వ్యక్తం చేస్తూ ఆందోళనకు దిగారు.

పోలీసుల జోక్యంతో పరిస్థితి సాధారణం

అర్ధరాత్రి నుంచి తెల్లవారుజాము వరకు పోలీసులు ఆసుపత్రి వద్ద బందోబస్తు ఏర్పాటు చేసి బంధువులు–వైద్యుల మధ్య చర్చలు జరిపారు. చివరకు ఉద్రిక్తత తగ్గి పరిస్థితి సాధారణ స్థితికి వచ్చింది. చిన్నారి మృతి మంచిర్యాల పట్టణంలో చర్చనీయాంశంగా మారింది.

ఇసుక అక్రమ రవాణాను ఉపేక్షించేది లేదు..

- జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్
- గోదావరిలో ఇసుక రీచ్ ల పరిశీలన

శెనార్తి మీడియా, మంచిర్యాల :

ఇసుక అక్రమ రవాణాపై ఎలాంటి రాజీ ఉండదని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ స్పష్టం చేశారు. గురువారం నస్పూర్ మండలం తాళ్లపల్లి సమీపంలోని గోదావరి నది తీరంలో ఉన్న సాండ్ రీచ్‌ను మండల తహసీల్దార్ సంతోష్‌తో కలిసి పరిశీలించారు. ప్రభుత్వ అనుమతులతోనే రీచ్‌ల ద్వారా ఇసుకను ఆన్‌లైన్ బుకింగ్ ప్రకారం రవాణా చేస్తున్నట్లు వివరించారు. ఇందిరమ్మ ఇండ్ల పథకం లబ్ధిదారులకు ఇంటి నిర్మాణానికి కావలసిన ఇసుకను ఉచితంగా అందిస్తున్నట్లు తెలిపారు. ప్రభుత్వ పనుల కోసం అవసరమైన ఇసుక కూడా రీచ్‌ల ద్వారానే పంపిణీ అవుతుందని చెప్పారు. అక్రమ రవాణా ప్రయోగాలను అరికట్టేందుకు సంబంధిత శాఖలు కఠిన పర్యవేక్షణ కొనసాగించాలని, నిబంధనలు ఉల్లంఘిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. రీచ్‌కు రాకపోకలకు తాత్కాలిక దారి ఏర్పాటుకు సూచనలు జారీ చేశారు. తదుపరి హాజీపూర్ మండలం ముల్కల్ల సమీపంలోని రీచ్‌ను మండల తహసీల్దార్ శ్రీనివాస్ రావు దేశ్ పాండేతో కలిసి పరిశీలించారు. అనంతరం గుడిపేట, నంనూర్ గ్రామాల్లో ఏర్పాటు చేసిన వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలను సందర్శించిన కలెక్టర్, రైతుల వద్ద నుండి నిబంధనల ప్రకారం ధాన్యం కొనుగోలు చేసి మద్దతు ధర చెల్లిస్తున్నట్లు తెలిపారు. కేంద్రాల్లో త్రాగునీరు, నీడ, గోనె సంచులు, టార్పాలిన్లు, తూకం యంత్రాలు, తేమ కొలిచే యంత్రాలు, ప్యాడి క్లీనర్లు వంటి సదుపాయాలను అందుబాటులో ఉంచినట్లు పేర్కొన్నారు. రైతులకు ఇబ్బంది లేకుండా కొనుగోలు ప్రక్రియ సాగాలని సూచించారు. కార్యక్రమంలో సంబంధిత విభాగాల అధికారులు పాల్గొన్నారు.

ఆయిల్ పామ్ సాగు విస్తరణపై దృష్టి

అధికారుల సమన్వయంతో ముందడుగు :కలెక్టర్ కుమార్ దీపక్

శెనార్తి మీడియా, మంచిర్యాల:

జిల్లాలో ఆయిల్ పామ్ సాగు విస్తీర్ణాన్ని పెంపొందించేందుకు అధికారులు సమన్వయంతో పనిచేయాలని కలెక్టర్ కుమార్ దీపక్ తెలిపారు. నస్పూర్‌లోని సమీకృత జిల్లా కార్యాలయాల భవనంలో ఆయిల్ పామ్ సాగు పురోగతిపై గురువారం నిర్వహించిన సమీక్ష సమావేశంలో ఆయన మాట్లాడారు. సమావేశంలో అదనపు కలెక్టర్ పిచంద్రయ్య, జిల్లా వ్యవసాయ అధికారి సురేఖ, ఉద్యానవన పట్టు పరిశ్రమ అధికారి అనిత, పౌర సరఫరాల అధికారి బ్రహ్మారావు, జిల్లా సహకార అధికారి, డివిజనల్–మండల స్థాయి వ్యవసాయ, ఉద్యానవన అధికారులు, వ్యవసాయ విస్తరణ అధికారులు, పిఎసిఎస్ ప్రతినిధులు పాల్గొన్నారు. కలెక్టర్ మాట్లాడుతూ ఆయిల్ పామ్ పంటతో లభించే ఆదాయాన్ని రైతులకు వివరించి సాగు విస్తరణకు ప్రోత్సాహం ఇవ్వాలని సూచించారు. జిల్లాకు నిర్దేశించిన 2 వేల ఎకరాల లక్ష్యంలో ప్రస్తుతం 438 ఎకరాల్లో మాత్రమే సాగు జరుగుతోందని, మిగిలిన విస్తీర్ణ సాధనకు చర్యలు వేగవంతం చేయాలని సూచించారు. రైతు సంక్షేమాన్ని దృష్టిలో ఉంచుకుని ప్రభుత్వం వరి, పత్తి వంటి పంటలను మద్దతు ధరకు కొనుగోలు చేస్తోందని తెలిపారు. కొనుగోలు కేంద్రాల్లో తేమ శాతం సహా నిబంధనలకు అనుగుణంగా నాణ్యమైన ధాన్యం స్వీకరించేలా పర్యవేక్షించాలని సూచించారు. కేంద్రాల్లో త్రాగునీరు, గోనె సంచులు, టార్పాలిన్లు, తూకం యంత్రాలు, తేమ యంత్రాలు వంటి సౌకర్యాలు తప్పనిసరిగా ఉండేలా చూడాలని పేర్కొన్నారు. రైతులు ధాన్యం తీసుకురాగానే టోకెన్లు జారీ చేసి కొనుగోలు ప్రక్రియను సజావుగా నిర్వహించాలని తెలిపారు. రైతు సంక్షేమం కోసం ప్రభుత్వం అనేక కార్యక్రమాలు అమలు చేస్తోందని, కొనుగోళ్లలో ఆలస్యం లేకుండా చెల్లింపులు జరిగేలా అధికారులు కృషి చేయాలని కలెక్టర్ సూచించారు. సమావేశానికి ముందు కేంద్ర జలశక్తి మంత్రిత్వ శాఖ నిర్వహించిన జాతీయస్థాయి 6వ జల పురస్కారాల్లో మంచిర్యాల జిల్లా సాధించిన గుర్తింపు నేపథ్యంలో కలెక్టర్‌ను సత్కరించారు. ఈ కార్యక్రమంలో సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

క్వాక్ క్లినిక్స్ పై వెంటనే చర్యలు తీసుకోండి

- ఐఎంఏ, మెడికల్ టాస్క్ ఫోర్స్, హెచ్ ఆర్ డీఏ డిమాండ్

శెనార్తి మీడియా, మంచిర్యాల :

మంచిర్యాల జిల్లాలో నియంత్రణ లేకుండా నడుస్తున్న క్వాక్ క్లినిక్స్, అనధికార హాస్పిటల్స్‌పై తక్షణ చర్యలు తీసుకోవాలని ఇండియన్ మెడికల్ అసోసియేషన్ (ఐఎంఏ), డీఎంహెచ్‌వో మెడికల్ టాస్క్ ఫోర్స్, హెచ్ఆర్‌డీఏ సంయుక్తంగా జిల్లా కలెక్టర్, డీఎంహెచ్ వో, ఆర్డీఓలకు వినతిపత్రం అందజేశారు. వైద్య సంఘాలు తెలిపిన వివరాల ప్రకారం ఎఎంసీ చట్టంలోని సెక్షన్లు 34, 54 ప్రకారం ఇప్పటికే ఎఫ్ఐఆర్లు నమోదైన కొన్ని క్వాక్ క్లినిక్స్ ఇప్పటికీ కొనసాగుతున్నాయని, వాటిని తక్షణమే మూసివేయాల్సిన అవసరం ఉందని వారు పేర్కొన్నారు. అక్రమ వైద్య సేవలు ప్రజారోగ్యానికి తీవ్రమైన ప్రమాదమని, చట్ట అమల్లో ఉన్న లోపాలను వెంటనే సవరించాలని సూచించారు. జిల్లా స్థాయిలో పర్యవేక్షణను బలపడేలా కలెక్టర్, పోలీసు కమిషనర్, ఐఎంఏ ప్రతినిధులు, డిఎం హెచ్వో సభ్యులుగా పాల్గొనే జిల్లా రిజిస్ట్రేషన్ అథారిటీని ఏర్పాటు చేయాలని వారు వినతి పెట్టారు. హాస్పిటల్స్, క్లినిక్స్, డయాగ్నస్టిక్ సెంటర్ల పని తీరును కట్టుదిట్టంగా పర్యవేక్షించడానికి ఈ అథారిటీ కీలకమని అభిప్రాయపడ్డారు. ప్రజారోగ్య రక్షణ కోసం చట్టపరమైన చర్యలు కఠినంగా అమల్లోకి రాకపోతే క్వాక్ ప్రాక్టీస్ మరింత విస్తరించే ప్రమాదం ఉందని, సమస్యకు దీర్ఘకాలిక పరిష్కారం స్థిరమైన నియంత్రణ వ్యవస్థ ఏర్పాటే అని వైద్య సంఘాలు తమ వినతిలో పేర్కొన్నాయి.

ఆటో డ్రైవర్ అస్లాంకు హరీష్ రెడ్డి ఫౌండేషన్ చేయూత

శెనార్తి మీడియా, గోదావరిఖని:

మల్లికార్జున నగర్‌లో నివసిస్తున్న ఆటో డ్రైవర్ అస్లాం ఇంటి ముందు నిలిపిన ఆటో ప్రమాదవశాత్తు మంటల్లో దగ్ధమై జీవనోపాధి కోల్పోయాడు. విషయం తెలుసుకున్న బీఆర్ఎస్ నాయకుడు, హరీష్ రెడ్డి ఫౌండేషన్ వ్యవస్థాపకుడు వ్యాల హరీష్ రెడ్డి అస్లాం కుటుంబాన్ని పరామర్శించి రూ.10,000 ఆర్థిక సహాయాన్ని అందజేశారు.ఆటో డ్రైవర్లకు ఏఆపద వచ్చినా తమ ఫౌండేషన్ ద్వారా తోచిన సహాయం అందిస్తామని ఆయన తెలిపారు. రెండు సంవత్సరాల క్రితం కాంగ్రెస్ ప్రభుత్వం ఆటో డ్రైవర్లకు నెలకు రూ.12,000 ఇస్తామని చెప్పినా అమలు చేయకపోవడంతో ఎన్నో కుటుంబాలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నాయని తెలిపారు. ఇప్పటివరకు పది మందికి పైగా ఆటో డ్రైవర్లకు ఆర్థిక సహాయం అందించినట్లు హరీష్ రెడ్డి తెలిపారు.కార్యక్రమంలో ఎండి జాహిద్ పాషా, పోలాడి శ్రీనివాసరావు, మెరుగు చంద్రమౌళి, కృష్ణస్వామి, బూరుగు వంశీకృష్ణ, నడిపెల్లి సాయి, బోట్ల పోషం, కడారి శ్రీహరి, అనూభయ్, ఎలకపల్లి అంజయ్య, మధు, బండి రాజు, ముజీబ్ తదితరులు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికి నేను మీతోనే ఉంటా : ఆడే గజేందర్

- ధాంపూర్ గ్రామస్తులతో మర్యాదపూర్వక సమావేశం
- డంపింగ్ యార్డ్ సమస్యపై కలెక్టర్ తో మాట్లాడుతానని హామీ

శెనార్తి మీడియా, బోథ్ :

నేరడిగొండ మండల కేంద్రంలోని క్యాంప్ కార్యాలయంలో బోథ్ నియోజకవర్గ కాంగ్రెస్ ఇంచార్జి ఆడే గజేందర్‌ను గుడిహత్నూర్ మండలం ధాంపూర్ గ్రామస్తులు, మహిళలు మర్యాదపూర్వకంగా కలిసి గ్రామం ఎదుర్కొంటున్న పలు సమస్యలను వివరించారు. ముఖ్యంగా డంపింగ్ యార్డ్ కారణంగా ప్రజలు తీవ్ర అసౌకర్యానికి గురవుతున్నారని, రహదారిపై ప్రయాణం చాలా కష్టమైందని గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేశారు. వారి వివరాలను విన్న ఆడే గజేందర్, "మీ సమస్యల పరిష్కారానికి నేను మీతోనే ఉంటా. డంపింగ్ యార్డ్ సమస్యను ఈ రోజే జిల్లా కలెక్టర్‌తో మాట్లాడి అవసరమైన చర్యలు తీసుకునేలా చూస్తా" అని హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా గ్రామస్తులు గజేందర్‌కు కృతజ్ఞతలు తెలిపారు. సమావేశంలో రాథోడ్ రమేష్, గుండయ్య, సుమన్ సహా మహిళలు పాల్గొన్నారు.

మత సామరస్యానికి నిలువెత్తు నిదర్శనంగా షేక్ అలీ

- అయ్యప్ప స్వాములకు భిక్ష ఏర్పాటు
- ఆరేళ్లుగా అన్నదానం కొనసాగిస్తున్న అలీ

శెనార్తి మీడియా, బోథ్ :

బోథ్ మండలంలోని దన్నూరు బి గ్రామానికి చెందిన షేక్ అలీ గురువారం అయ్యప్ప స్వాములకు అన్నదానం ఏర్పాటు చేసి మత సామరస్యానికి నిలువెత్తు నిదర్శనంగా నిలిచారు. గత ఆరు సంవత్సరాలుగా అయ్యప్ప మాలధారులకు భిక్ష ఏర్పాటు చేస్తూ అలీ సామూహిక ఐక్యతను చాటుకుంటున్నారు. ఈ సందర్భంగా అలీ మాట్లాడుతూ రంజాన్‌లో పాటించే ఉపవాస శ్రద్ధ ఎంత పవిత్రమో, అయ్యప్ప స్వాములు నెల రోజులపాటు అనుసరించే కఠిన నియమాలు కూడా అంతే ఆప్యాయతను కలిగిస్తాయని అన్నారు. కుల–మత భేదాలు పక్కనబెట్టి అన్ని పండుగలను పరస్పర గౌరవంతో కలిసి జరుపుకోవాలనే మన దేశం విలువలను ఇలాంటి కార్యక్రమాలు మరింత బలపరుస్తాయని పేర్కొన్నారు. అయ్యప్ప స్వాములకు అన్నదానం చేయడం తనకు ఆత్మసంతృప్తిని ఇచ్చిందని, సమాజం శాంతి–సౌభ్రాతృత్వాలతో ముందుకు సాగాలని ఆకాంక్షించారు.

ఈ కార్యక్రమంలో గురు స్వామి బద్దం రమణారెడ్డి, అరుణ్ రెడ్డి, సందీప్ రెడ్డి, ప్రవీణ్ రెడ్డి, విజయ్ రెడ్డి, జైపాల్ రెడ్డి, అమరేందర్ రెడ్డి, సంతోష్, రమేష్, భోజన్న, స్నేహిత్ రెడ్డి, పురుషోత్తం, నాగార్జున తదితరులు పాల్గొన్నారు.

స్థానిక సంస్థల ఎన్నికలు సమర్థవంతంగా నిర్వహించాలి

- రాష్ట్ర ఎన్నికల సంఘం కమిషనర్ రాణి కుముదిని
- రాణి కుముదిని, రాష్ట్ర ఎన్నికల సంఘం కమిషనర్

శెనార్తి మీడియా, మంచిర్యాల:

రాష్ట్రంలో స్థానిక సంస్థల ఎన్నికలను సమర్థవంతంగా నిర్వహించాలని రాష్ట్ర ఎన్నికల సంఘం కమిషనర్ రాణి కుముదిని తెలిపారు. నవంబర్ 20న హైదరాబాద్‌లో రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావు, డీజీపీ శివధర్ రెడ్డి, ఎన్నికల సంఘం అధికారులతో కలిసి ఆమె వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సమావేశంలో అన్ని జిల్లాల కలెక్టర్లు, పోలీసు ఉన్నతాధికారులు, అదనపు కలెక్టర్లు, పంచాయతీ అధికారులతో సర్పంచ్–వార్డు సభ్యుల ఎన్నికల నిర్వహణ, ఓటరు జాబితా అభ్యంతరాలు, పోలింగ్ కేంద్రాలు, రిజర్వేషన్ల ప్రక్రియ, శాంతి భద్రతల అంశాలపై సమీక్ష జరిగింది.

కమిషనర్ మాట్లాడుతూ... సర్పంచ్, వార్డు సభ్యుల ఎన్నికలను ప్రశాంత వాతావరణంలో సమర్థవంతంగా నిర్వహించాలని సూచించారు. ఎన్నికలను మూడు విడతల్లో నిర్వహించేందుకు అవసరమైన కార్యాచరణ రూపొందించాలని తెలిపారు. ఎన్నికల సమయంలో రాష్ట్ర–జిల్లా స్థాయిలో ఎన్నికల ప్రవర్తన నియమావళిని కఠినంగా అమలు చేయాలని పేర్కొన్నారు. ఎన్నికల పరిశీలకుల శిక్షణకు ఏర్పాట్లు జరుగుతున్నాయని వెల్లడించారు. జిల్లా స్థాయిలో ఏర్పాటు చేసే ఎన్నికల నిర్వహణ కమిటీ సభ్యుల జాబితా వెంటనే సమర్పించాలని సూచించారు.

– జిల్లాలో అన్ని ఏర్పాట్లు సిద్ధం

మంచిర్యాల జిల్లాలో మొత్తం 306 పంచాయతీలు, 2,680 వార్డు సభ్యుల స్థానాలకు ఎన్నికలు నిర్వహించేందుకు రాష్ట్ర ఎన్నికల సంఘం మార్గదర్శకాలను అనుసరిస్తున్నామని చెప్పారు. కార్యక్రమంలో డిసిపి భాస్కర్, డీపీఓ వెంకటేశ్వర్ రావు, జిల్లా పరిషత్ ముఖ్య కార్యనిర్వహణ అధికారి గణపతి, ఎన్నికల విభాగం అధికారులు పాల్గొన్నారు.

నాయి బ్రాహ్మణులకు అండగా ఆడే గజేందర్

శెనార్తి మీడియా, బోథ్ :

నేరడిగొండ మండల కేంద్రంలోని క్యాంప్ కార్యాలయంలో బోథ్ నియోజకవర్గ కాంగ్రెస్ ఇంచార్జి ఆడే గజేందర్‌ను మండల నాయి బ్రాహ్మణ సోదరులు మర్యాదపూర్వకంగా కలిసి సంఘం ఎదుర్కొంటున్న సమస్యలను వివరించారు. ముఖ్యంగా సంఘ భావన నిర్మాణానికి సహాయం చేయాలని కోరారు. వారి అభ్యర్థనపై స్పందించిన ఆడే గజేందర్, నాయి బ్రాహ్మణ సంఘ భావన నిర్మాణానికి 5 లక్షల నిధులు మంజూరు చేస్తానని హామీ ఇచ్చారు. సంఘ అభివృద్ధికి తన వంతు సహాయం అందించేందుకు సిద్ధంగా ఉన్నట్లు ఈ కార్యక్రమంలో మండల నాయి బ్రాహ్మణ సోదరులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు పాల్గొన్నారు.

ప్రమాదాల నివారణ ప్రణాళిక

శెనార్తి మీడియా, మంచిర్యాల: జిల్లాలో రోడ్డు ప్రమాదాలను తగ్గించేందుకు పటిష్ట చర్యలు తీసుకోవాలని కలెక్టర్ కుమార్ దీపక్ ఆదేశించారు. నస్పూర్‌లో జరిగిన రోడ్డు భద్రత కమిటీ సమావేశంలో పోలీసు, రెవెన్యూ, రవాణా, జాతీయ రహదారులు, పంచాయతీ రాజ్, మున్సిపల్ శాఖల అధికారులు పాల్గొన్నారు. రోడ్లపై చెత్త, ఆటంకాలను తొలగించడం, అనధికార వాహన నిలుపుదలపై చర్యలు, ప్రమాద ప్రదేశాల్లో హెచ్చరిక బోర్డులు, లైటింగ్ ఏర్పాటు వంటి అంశాలను ఆయన సూచించారు. ఓవర్‌లోడెడ్ వాహనాలపై కఠిన చర్యలు తప్పనిసరి అన్నారు. మున్సిపల్ కమిషనర్లు సెల్లార్‌లను పార్కింగ్‌కే వినియోగించాలన్నారు. విద్యుత్ స్తంభాల తొలగింపు, గ్రామాల్లో కేజ్ వీల్స్ వినియోగంపై అవగాహన, వేగ పరిమితి బోర్డులు, కూరగాయల విక్రయాలకు ప్రత్యేక ప్రాంతాల గుర్తింపు వంటి చర్యలను సూచించారు. ప్రమాద ప్రాంతాల్లో వేగనిరోధకాలు, సూచికలు ఏర్పాటు చేయాలని ఆదేశించారు. రోడ్లపై పశువులను గోశాలలకు తరలించాలని చెప్పారు.డీసీపీ ఎభాస్కర్ మాట్లాడుతూ చలికాలం దృష్ట్యా వాహనదారులు నిర్ణీత వేగంలో ప్రయాణించాలని సూచించారు. "అరైవ్–అలైవ్" అవగాహన కార్యక్రమాలు కొనసాగుతున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో విభాగాల అధికారులు పాల్గొన్నారు.